# కథ

**హేమ దోసిట్లో నీళ్ళలో చందమామ ప్రతిబింబం చూసి ఆనందించింది. అది భ్రాంతి. నిజం చందమామ ఆకాశంలోనే వుంటుంది.**

# దోసిట్లో చందమామ

★ ★ ★

హేమలతా ప్రసాద్‌గారు.... ప్రొఫెసర్‌గా ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ చేస్తున్నారు. గురుపౌర్ణమి రోజు సాయంత్రం ఆరుగంటలకు. కాలేజీ ఆడిటోరియంలో సన్మానం చేస్తున్నాం. విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థులు, అభిమానులూ ఈ పత్రికాప్రకటనను ప్రత్యేక వ్యక్తిగత ఆహ్వానంగా భావించి వేడ్కలు సభకు విచ్చేసి ఆహ్వాన సంఘం నిర్వహించే గురుపూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాము.

-అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

-పరిశోధకుల సమితి

-విద్యార్థీ, విద్యార్థినులు

దినపత్రికలో బాక్స్ కట్టి ప్రచురించిన ప్రకటన చూసాను. సభకి తప్పక వెళ్ళాలనుకున్నాను. ఇన్నాళ్ళకి..అదే ఇన్నేళ్ళకి హేమని చూసే అవకాశం వచ్చినందుకు మనసు మిశ్రమభావాలతో నిండిపోయింది.

★ ★ ★

ప్రొద్దున్నే బయలుదేరాను. బస్సు ప్రయాణం. కిటికీ ప్రక్క సీటు. రోడ్డుకి ఇరవేపులా పంటపొలాలు. దేవుడు పారేసుకున్న ఆకుపచ్చ జేబురుమాళ్ళలా వున్నాయి.

గులాబీల పల్లకీలో కూర్చున్నా ముళ్ళు గుచ్చుకున్నట్లు ఆలోచనలు మనసును పొడుస్తున్నాయి.

నేను పైకి మామూలు మనిషిలా కనిపిస్తున్నాను.

నాకు తెలుసు. నా మనసొక మరుగుజ్జు.

స్వార్థం పేరుకున్న డ్వార్ఫ్.

భావాలు అంగుష్టమాత్రపు లిల్లీ పుట్లు. వాటి పరిధి చాలా స్వల్పం.

ఆశలు కంటికి కనిపించని మైక్రోబులు. అవి క్షణ క్షణం రెట్టింపవుతూ వుంటాయి. జామెట్రికల్ రేషియోలో పెరుగుతాయి. ఆశయాలు ఇవాపరేట్ అయిపోయాయి హారతి కర్పూరంలాగా, ఒక్కటి మాత్రం నిజం. నాలో ఏదో కోరిక ఉంది.

శేషజీవితం..వంటరిగా గడపలేను.

తోడు కావాలి. లోన్లీనెస్ ఈజ్ ఏ కర్స్. బోర్‌డమ్ పనిష్మెంట్ వంటరి బ్రతుకు అంపశయ్య. పదునైన ముళ్ళలతో చేసిన మంచం అంగార తల్పం. నిప్పుల పరుపు మీద నిద్రరాదు. స్థిమితంగా వుండదు ముందు ముందు జీవితం. అవద్య నరకం. పున్నామాది చతుర్దశ నరకాల్లో భయంకరం..బాధాకరం..అయినది అవద్యం.

ప్రతిదానికీ ఇతరులపై ఆధారపడాలి.

ఆ నరకాన్నుంచీ ఆ జగన్మాతే రక్షించగలదు. అందుకే ఆమె అనవద్య.

నాకు మనశ్శాంతినిచ్చేది శ్రీలలితా సహస్రనామ పారాయణం. మనసులో మననం చేసుకుంటాను వీలున్నప్పుడల్లా. నామ జపం.

"రాజరాజార్చితా, రాజ్ఞీ, రమ్యా, రాజీవలోచనా

రంజనీ, రమణీ, రస్యా, రణత్కింకిణి మేఖలా"

అది మంత్రం..అది తంత్రం..అది యంత్రం..దానికో శక్తివుంది. మనసు తేలికపడింది.

కాలం మాయతివాచీ. ఎంత పరిచినా యింకా రోల్ మిగిలే వుంటుంది.

సినిమాలో పాత్రలకి డైరక్టరే దేవుడు. నిజ జీవితంలో మనుషులకి దేవుడే డైరక్టరు.

కష్టాలని కాలంతో హెచ్చవేస్తే దుఃఖం.

ఉత్సాహంతో భాగారిస్తే మిగిలే శేషం ఆనందం.

నాకు చిన్నప్పటినుంచీ హెచ్చవేతలే వచ్చు. భాగారాలు రావు. మనుషుల మనసుల్ని అంచనా వేసే లెక్కల్లో నేనూ పూర్ జీరో.

కాలేజీ రోజులు. తీపిగుర్తులు..మరపురాని మధురక్షణాలు.

నేనూ, హేమా..యూనివర్శిటీలో సహాధ్యాయులం.

దూరపుచుట్టరికం వుంది. రాకపోకలు లేవు.

ఎమ్మెస్సీ కెమిస్ట్రీ తర్వాత హేమ టీచింగ్‌కి వెళ్ళింది.

నేను ఇండస్ట్రీ సైడుకి వెళ్ళాను. పాఠం చెప్పలేనని ఇన్‌ఫీరియారిటీ ఫీలింగ్. చదువుకునే రోజుల్లో మేం రోజు బీచ్‌లో కలుసుకునే వాళ్ళం. హేమని కలవకుండా వుండలేకపోయేవాడిని. పిచ్చాపాటీ..రాజకీయాలు..టీచర్ల మీద జోకులు..సినిమాలు..సబ్జెక్ట్ మీద డవుట్లు..గంటలు గడిచేవి. ఆ రోజులు మళ్ళీ రావు.

ఫైనలియర్ అయింది. వేసవి శలవులు. మనసు మార్పు కోరుతుంది. హేమావాళ్ళ ఊరు వెళ్ళాను. హేమ రమ్మని పిలవలేదు.

రైలు, బస్సు, ఎద్దుబండీ, నడక..ప్రయాసతో కూడిన ప్రయాణం. నేను వెళ్ళేటప్పటికి హేమ లేదు.

"రావయ్యా..ఎన్నాళ్ళకి తీరింది.." ఆహ్వానించింది హేమతల్లి. వాళ్ళ నాన్నగారు పొలానికెళ్ళారు.

"హేమ లేదా?"

"స్నేహితురాలింటికి వెళ్ళింది. వస్తుంది. కాఫీ తీసుకో. మా ఊరి ప్రయాణం కష్టమే" ఆమె చూపిన ఆప్యాయత బడలికను తగ్గించింది.

ఏదో పాత వారపత్రిక తిరగేస్తున్నాను టైం గడవటానికి. ఇంతలో హేమ వచ్చింది. చిరు చీకటి పడింది.

"ఎంతసేపయింది వచ్చి. ఊరక రారు మహాత్ములు" నవ్వుతూ వ్యంగ్యంగా అంది. నవ్వుతుంటే హేమ బుగ్గల మీద సొట్టలు పడతాయి.

"గంటయింది. మామూలు మనిషిని. అనవసరంగా పైకెళ్ళిన పెద్దలతో పోల్చకు"

వరండామెట్ల ప్రక్కన వున్న తొట్లోంచి దోసెడు నీళ్ళు తీసుకుని పాదాలపై పోసుకుంది. చీరకుచ్చెళ్ళు తడవకుండా ఇంకో దోసెడు నీళ్ళు తీసుకుని అట్లాగే చూస్తూ వుండిపోయింది. తనలో తనే నవ్వుకుంటోంది.

"ఏమిటి అంత పరీక్షగా చూస్తున్నావు?" మెట్లు దిగి వచ్చాను.

"దోసిట్లో చందమామ ఎంత అందంగా వుందో చూడు" అంది.

"కవిత్వానుభూతా?"

"నిజంగా, చూడు..దోసిట్లో చందమామ"

"అది భ్రమ..భ్రాంతి..నిజం చంద్రుడు ఆకాశంలోనే వుంటాడు" నీళ్ళు మొహం మీద జల్లుకుని లోపలికెళ్ళింది.

గేటు చప్పుడయింది. వాళ్ళ నాన్నగారు వచ్చారు.

"ఏమిటి..మీ నగరంలో విశేషాలు.." పలకరింపు

"ఏముంటాయి..మామూలే" నిర్లిప్తంగా చెప్పాను.

రాత్రి భోజనాలయ్యాక ఆరుబయట మంచాలపై కూర్చున్నాం.

సంభాషణ నేనే ప్రారంభించాను. అదీ పెళ్ళి విషయం.

"నేను హేమని పెళ్ళి చేసుకోవాలని.." మాటలు పూర్తికాలేదు.

"ఆ విషయం తప్ప ఇంకేదయినా మాట్లాడు" నిష్కర్షగా చెప్పారాయన. ఆ దురుసుతనానికి నా మనసు గాయపడింది. హేమ తల్లి మౌనం వహించింది. అర్థాంగీకారమౌనం కాదు. హేమ లోపలుంది. తటస్థంగా వుంది. ఎవర్నీ సమర్థించలేదు. వాళ్ళకి అమ్మమీద యింకా కోపం తగ్గలేదు.

అమ్మ చేసిన తప్పుని వాళ్ళు క్షమించలేరు. క్షణికావేశంలో వర్ణాంతర ప్రేమ వివాహం చేసుకుని ఇల్లు విడిచి



వెళ్ళింది. అదీ మూల కారణం. డిస్కషన్ ఒ క్ ఆగిపోయింది అర్ధాంతరంగా.

హేమ మంచినీళ్ళ చెంబు మం దగ్గర పెడుతూ-"చెప్పావుగా దోసిట్లో దమామ భ్రమని..భ్రాంతని..నీళ్ళు వదిలెయ్యగానే లాలుగా విరిగిపోతుంది. ఇంకెప్పుడూ వాళ్ళ దగ్గరకె ప్రస్తావన తేవద్దు. తెస్తే నా మీద ఒట్టే" గబగబా చెప్పి ళ్ళింది.

రాత్రి నిద్దర పట్టలేదు. ఆలోచనలు టీగలలా ముసురుకున్నాయి. పరస్పర విరుద్ధాల పెద్దవాళ్ళ పట్టుదలలు. పిల్లల జీవితాలకు అవరోధాల పతి వ్యక్తికీ కనిపించని సంకెళ్ళున్నాయి. భవబంధాలు.

★ ★ ★

హేమలత బ్యాంక్ మేనేజర్ జగదీష్ ప్ర దని పెళ్ళి చేసుకుంది. వర్సిటీలో లెక్చరర్‌గా చేరింది.

ఉద్యోగరీత్యా నేను బొంబాయి చేరా ప్రవాసాం ధ్రుణ్ణయ్యాను. ఒక మహారాష్ట్ర కుటుంబం పేయింగ్ గెస్ట్‌గా వుండేవాడిని. ఉమాకాంతకస్ బే గారు పెద్ద ఉద్యోగి ఓ ప్రైవేటు సంస్థలో. వాళ్ళమ్మా సరోజను నేను చేసుకున్నాను. మారేజ్ ఆఫ్ కన్వీనిం . కల్చరల్ గాప్...లాంగ్వేజ్ ప్రాబ్లెం. కొన్నాళ్ళు సంఘర్ష తో పడ్డాను. అది వన్ వే ట్రాఫిక్. పోవటమే కానీ రావ వుండదు. కాలం జీవనదిలా ప్రవహిస్తుంది. మనుష బాధలూ, సంఘటనలతో దానికి పని లేదు. అది ప్రకృతి సనాతనమైనది. ఎప్పుడూ వుండేది. మనోభావాలు, చిగురించే ఆశలూ, ఏర్పరచుకున్న ఆశయాలూ, కాగితపు పడవల్లా తేలిపోతాయి. నదీ ప్రవాహం ఆగదు. కాగితపు పడవలు అట్లా తేలితేలి నదిలో తడిసిపోయి కాలగర్భంలో చివికిపోతాయి.

బొంబాయి ఉద్యోగానుభవంతో ఎక్కువ జీతానికి చెన్నయికి వచ్చాను. సరోజకి దక్షిణాది గిట్టదు. పిల్లాడికి అక్కడే చదువు. వాళ్ళిద్దరు నాతో రాలేదు. వాళ్ళు బొంబాయి వదలలేరుట. అదిగో అప్పటి నుంచీ నేను వంటరివాడిని. సరోజ దృష్టిలో నేనొక అవకాశవాదిని. అంతర్ముఖుణ్ణి. పనికిరాని వాడిని. జోకర్‌ని.

హేమ భర్త గుండెపోటుతో పోయాడు. చాలా ఆలస్యంగా తెలిసింది. వెళ్ళి పలకరించాలి. నాకు మొహం చెల్లలేదు. ఎలా వెళ్ళను? ఏ మొహం పెట్టుకు వెళ్ళను. ఏమని ఓదార్చను. అసలు నాకా అర్హత వుందా అన్నది ప్రశ్న. ఇన్నేళ్ళూ నేను ఏం చేస్తున్నట్లు. పలాయనవాదిగా గుర్తిస్తారు. అట్లా క్రమక్రమంగా మేం దూరమయిపోయాం. ఎంతో దూరం. ఆత్మీయత ఒక వింత విషయం. రెండువైపులా పదునున్న కత్తి. దూరం కావడం ప్రారంభం అయితే, అంతే అగాథం పెరుగుతుంది. దగ్గరకావటం మొదలుపెడితే, అంతే ఆత్మలను ఏకం చేస్తుంది. ప్రతి మనిషీ కోరుకునేది తను అందరి చేతా ప్రేమించబడాలి. ప్రేమరాహిత్యం వల్ల ఎన్నో అనర్థాలు. ఆత్మీయత, అనుర్థాగం వరాలు. కోరుకుంటే దొరకవు. ఆ వరాలు పొందని వాడు మానసిక నిరుపేద.

ఇదంతా గతం.

నా స్వగతం.

★ ★ ★

బస్టాండ్ నుంచీ ఆటోలో యూనివర్సిటీకి వెళ్ళేటప్పటికి సభ ప్రారంభం అయింది. కాన్వోకేషన్ హాల్ అలంకరణతో కళకళలాడుతోంది. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథి. వక్తలు హేమలత కార్యదీక్షనూ, క్రమశిక్షణనూ పొగిడారు. తోటి అధ్యాపకులు ఆమె స్నేహశీలతను శ్లాఘించారు. విద్యార్థులు అపర సరస్వతి అని కొనియాడారు. శాలువాలు కప్పారు. పూలదండలు వేసారు. ఫొటోలు తీసారు. హేమ తనదైన ఫక్కీలో వినయంగా ధన్యవాదాలు చెప్పింది. జీపులో ఊరేగింపుగా తీసుకెళ్ళి ఇంటి దగ్గర దించారు. కాలేజీ ప్రాంగణంలో హేమతో మాట్లాడటం కుదరలేదు. జనం..జనం..కొందరు ఆటోగ్రాఫులూ తీసుకున్నారు.

**రాధామనోహరన్**

★ ★ ★

హేమ ఇల్లు ఒక ఆశ్రమంలో వుంది. అదు ఆశ్రమమే. కాలింగ్ బెల్ నొక్కాను పరిసరాలు పరీక్షిస్తూ. వింత సంగీతధ్వనుల మధ్య తలుపు తెరిచింది. హేమ నన్ను గుర్తు పట్టలేదు. అసలు నేను వస్తానని ఊహించి వుండదు. ఊహించే అవకాశం కూడా లేదు. కాలం చేసిన గారడీలో మనిషి రూపం మారుతుంది. అది అనివార్యం. నా వంకుల జుట్టు..బట్టతలగా మారింది. ఆత్మధైర్యం తగ్గటం వల్ల మాటల్లో తడబాటు..ఓ విధమైన నెర్వస్‌నెస్. వృద్ధాప్యపుఛాయలు ముడతలుగా కనిపిస్తు న్నాయి. పైగా బీపీ, సుగర్‌లాంటి శారీరక రుగ్మతల వల్ల శరీరం బాగా కృశించింది. మానసిక వేదన వల్ల కళ్ళచుట్టూ నల్లని వలయాలు వచ్చాయి. మనసులో ఉత్సాహం, శరీరంలో శక్తి తగ్గిపోయిన జాడలు కళ్ళల్లో తెలుస్తున్నాయి. హేమ మాత్రం పెద్దగా మారలేదు. నాకట్లా అనిపించింది.

"ఎవరూ?" కళ్ళజోడు సరిచేసి చూసింది.

"నేనూ..పేపరు ప్రకటన చూసి వచ్చాను" గొంతు గుర్తుపట్టింది.

"నువ్వా..నిజంగా నేను గుర్తు పట్టలేదు"

"సహజం. అందరూ అదే అంటారు"

"రా..లోపలికి..కూర్చో"

మంత్రముగ్ధుళ్ళా వెళ్ళి సోఫాలో కూర్చున్నా..

విశాలమయిన గది. ప్రార్థనా మందిరంలా వుంది.

గోడల నిండా అలమార్లు..వాటినిండా పుస్తకాలు.

గూట్లో రాజరాజేశ్వరీ దేవి విగ్రహం. ఇరువైపులా గోడ మీద కంచిస్వాముల నిలువెత్తు లామినేటెడ్ ఫోటోలు. పూలదండలు. అగరవత్తుల సువాసన. అతి పవిత్రమయిన వాతావరణం. ఆధ్యాత్మిక చింతనతో కూడిన మార్మిక అనుభూతి. ఇంకాసేపు గడపాలనిపించే శాంతి నిలయం.

"లాన్‌లో హాయిగా వుంటుంది" అంది హేమ.

గార్డెన్ హేమ అభిరుచికి ప్రతీకగా వుంది. రకరకాల పూల చెట్లు, మందారాలు, చంపకాలు, చామంతులు, మల్లెలూ, గులాబీలు, జాజులు...

గడ్డిమీద కూర్చున్నాం. మెత్తటి చైనీస్ లాన్‌గ్రాస్.

"ఎలా వున్నావు?" మామూలు ప్రశ్న.

"వంటరిగా వున్నాను" నిర్లిప్తమైన జవాబు.


"నీ భార్య..పిల్లాడు" సందిగ్ధత.

"బొంబాయిలో వుండిపోయారు. రారుట. నేను చెన్నయిలో వంటరిగా. సత్రం భోజనం..మఠం నిద్రా అక్కరకురాని భార్యనీ, పుత్రుణ్ణీ గ్రక్కున వదిలేసా.."

"సోసారీ..నాకు తెలీదు" పశ్చాత్తాపపడింది హేమ.

"నువ్వెలా వున్నావు" అర్థంలేని ఆలస్యపు ప్రశ్న. కాసేపు హేమ ఏం మాట్లాడలేకపోయింది.

"వంటరిగా వున్నాను. ఇన్నాళ్ళూ..స్టూడెంట్స్ మధ్య




కాలం వేగంగా పరుగెత్తింది. రేపట్నించీ మరీ లోన్లీ.."

"నా యింటికి రారాదూ?" నసిగాను. గట్టిగా అడిగే ధైర్యం లేదు.

"వచ్చి?" హేమ భావం అర్థం కాలేదు.

"మనం కలిసుందాం..మంచి స్నేహితుల్లా.."

"ఇన్నాళ్ళకి తోడూ..స్నేహం గుర్తొచ్చాయి కదూ"

"అవును. నేను చాలా కాలం వృధా చేసాను. ఓ కథ తెలుసుగా, తుమ్మెద కమలంలోని తేనె తాగుతూ మత్తుగా వుంటుంది. ఈలోగా సూర్యాస్తమయమయి తామర రేకులు ముడుచుకుంటాయి. హాయిగా ఈ రాత్రంతా తేనెతాగి ఉదయమే ఎగిరిపోవచ్చు అనుకుంటుంది తుమ్మెద. ఈలోగా మత్తేభం వచ్చి తామర పువ్వుని తొండంతో లాగి, పీకి, తినేస్తుంది. ఇందులో నేను భ్రమరం, కాలం ఏనుగు.." ఆవేశంగా చెప్పాను. అంత కంటే వివరంగా చెప్పటం కష్టం.

గాలం చూసి భయపడిన చేపపిల్లలాగా..

రెక్కలు తెగిన బుల్లిపిట్టలా హేమ వణికింది.

"సారీ..యూ ఆర్ టూ లేట్" హేమ మాటలు జీరగా వున్నాయి.

నిఘంటువులో మాటలుంటాయి. భావాలుండవు. హేమను ఒప్పించటం..కష్టం. నావల్ల కాదు. నేను అల్పుణ్ణి. తప్పునాది..ఆలస్యం నాది. దోషం నాది. అయామ్ గిల్టీ... నా శరీరంలో కదలిక. మూలాధారం నుంచీ సహస్రారం దాకా షట్ చక్రాల్లో మూడున్నర చుట్ల కుండలిని, చలించిన భయోద్వేగం. మానవుని అంతర్ ప్రవృత్తిలో..ఆలోచన..పూర్ణయోగం కోసం ఊర్ధ్వ మనోలోకాలకు విహంగం ఎగురుతుంది. హేమ ముఖంలో నిస్సహాయత. నిర్వేదం. నిస్తేజం.

★ ★ ★

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

దూరం నుంచి ఓంకారం.

నాద శబ్దం..శబ్దనాదం..

రాలిన పారిజాతాల వాసన.

పున్నాగలు నేలమీద రాలుతున్న మెత్తటి చప్పుడు.

వెన్నెల వెలుగుల్లో ట్రెపీజ్‌లో పల్టీలు కొట్టే సర్కస్ పాపల్లాంటి తెల్లటి మబ్బు తునకలు ఆడుకుంటున్నాయి.

మనోవల్మీకంలో ఆలోచనా సర్పాల బుసలు ఉవ్వెత్తున లేచి స్తంభించిన కెరటాలు. గాజు పెంకులు చంద్రుని చుట్టూ ఘనీభవించిన వరద గూడు.

"పోనీ..నేను..నీ ఆశ్రమానికి రావచ్చా?"

"నాకు వంటరితనం అలవాటయింది"

"హేమా కనీసం అప్పుడప్పుడు... రావచ్చా?"

"నీ యిష్టం. ఈ కుటీరం తలుపులు తెరిచే వుంటాయి. నువ్వే చెప్పావుగా 'దోసిట్లో చందమామ క్షణికం."

హేమ మాటలు అర్థం చేసుకునే ఎత్తులకి నేను ఇంకా ఎదగలేదు. బహుశా అది సాధ్యం కాదు. హేమ ఒక యోగిని.

నేను ఇంకో జన్మ ఎత్తాలి. ఆమె సాధన చేసి కాలాన్ని గెలిచింది.

"ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలు అనుభవించాలి. తప్పదు. దానికి రాయితీలుండవు. నేను కుటీరం వదిలి అసలు రాలేను" హేమ ఒక ఫిలాసఫర్‌లా చెప్పింది.

హేమలో ఒక దేవత సాక్షాత్కరించింది. హేమ ముందు నేను వామనునిలా పొట్టిగా- బఫూన్‌లా...

నా మనోనేత్రం తెరుచుకుంది. నిన్ను నువ్వు తెలుసుకో... ఓ దివ్య జ్యోతి.

నేనేమిటో నాకు తెలిసింది. నేనొక వంటరివాడిని.

తిరుగు ప్రయాణం. రైల్లో..టిక్కెట్టు తీసుకున్నాను. స్లీపర్ కోచ్. ప్రయాణీకులందరూ గాఢ నిద్రలో వున్నారు. రైలు ఎక్కడికెళ్తుంది. నిద్రపోయే పట్టాల మీద. చలనం లేని పట్టాల మీద రైలు పరుగు పెడుతోంది. వేగంగా..అతివేగంగా.

★ ★ ★

'భజగోవిందం..భజగోవిందం.

గోవిందం భజ..మూఢమతే..'

పునరపి జననం..పునరపి మరణం

'సత్ సంగత్వే నిస్సంగత్వమ్

నిస్సంగత్వే నిశ్చలచిత్తమ్

నిశ్చలచిత్తే నిర్మోహత్వమ్

నిర్మోహత్వే మోక్ష ప్రాప్తిః '...ఎమ్మెస్ సుబ్బలక్ష్మి గొంతు

స్లీపర్ కోచ్‌లో అప్పర్ బెర్త్‌లో నేను..

క్రింది నుంచి పైకి వేగంగా వెళ్ళే రైలు చేసే వింత రిథమ్. ఆఫ్రికన్ డ్రమ్స్..నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. లయబద్ధంగా విన్యాసం.

దోసిట్లో..చందమామ

దోసిట్లో..చందమామ.